నేటి నుంచి పార్లమెంట్

- వచ్చే నెల 20 వరకు శీతాకాల సమావేశాలు
- వక్ఫ్ సహా 16 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్ర ప్రభుత్వం
- అదానీ, మణిపూర్ అంశాలపై నిలదీసేందుకు విపక్షాలు సిద్ధం

న్యూఢిల్లీ, నవంబర్ 24: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. డిసెంబర్ 20 వరకు జరిగే ఈ సమావేశాల్లో వక్ఫ్ (సవరణ) సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మణిపూర్ హింస, గౌతమ్ అదానీ అవినీతి చర్యలపై యూఎస్ అరెస్ట్ వారెంట్ తదితర అంశాలపై ఈ సమావేశాల్లో మోదీ సర్కారును నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి విపక్షం పట్టుబట్టవచ్చు. దేశమంతా ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన జమిలి ఎన్నికల బిల్లును లిస్టులో చేర్చకపోయినా దానిని ప్రవేశపెట్టవచ్చునని భావిస్తున్నారు. కాగా, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగేలా సహకరించాలని కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశంలో విజ్ఞప్తి చేసింది. అయితే అదానీ అవినీతి, మణిపూర్ అల్లర్లపై చర్చ జరగాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు.

26న ప్రసంగించనున్న రాష్ట్రపతి

రాజ్యాంగ ఆమోద 75వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభోత్సవానికి గుర్తుగా మంగళవారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాత పార్లమెంట్ భవనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాల్‌లో ప్రసంగిస్తారు. 'హమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్' పేరుతో ఏడాది పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం తెలిపారు.

ఫడ్నవీసా?.. షిండేనా?

- మహారాష్ట్ర కాబోయే సీఎం ఎవరు?
- మరికొన్ని గంటల్లో సస్పెన్స్‌కు తెర
- నేడు కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం



ముంబై, నవంబర్ 24 (నమస్తేతెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి అనూహ్య విజయం సాధించడంతో ఇప్పుడు సీఎం పీఠం ఎవరు అధిరోహిస్తారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సస్పెన్స్‌కు 24 గంటల్లో తెరపడే అవకాశం ఉంది. సోమవారం మహారాష్ట్ర సీఎం ప్రమాణస్వీకారం ఉంటుందని పార్టీ వర్గాలు తెలియజేశాయి. ఈ ఎన్నికల్లో 288 సీట్లకు మహాయుతి కూటమి 235 సీట్లు నెగ్గి విజయాన్ని కైవసం చేసుకుంది. అందులో బీజేపీ 132 సీట్లతో ప్రధాన పార్టీగా ఆవిర్భవించింది. అయితే అధికారం చేపట్టడానికి 145 మ్యాజిక్ ఫిగర్ కాగా, బీజేపీ దానికి ఎంతో దూరంలో లేదు. ఈ నేపథ్యంలో బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీసే ముఖ్యమంత్రి అవుతారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే సీఎంగా షిండేనే కొనసాగించాలని బీజేపీలోని కొందరు నేతలు సూచిస్తున్నారు.

జాతీయ రాజకీయాల్లోకి ఫడ్నవీస్?

ప్రస్తుతం సీఎంగా ఉన్న శివసేనకు చెందిన ఏక్‌నాథ్ షిండేనే కొంతకాలం కొనసాగించాలని, ఫడ్నవీస్‌ను జాతీయ రాజకీయాల్లోకి తెచ్చి జేపీ నడ్డా స్థానంలో పార్టీ అధ్యక్షుడిని చేయాలని బీజేపీలోని కొందరు నేతలు సూచిస్తున్నారు. సీఎంగా ఉన్న షిండేను చూపిస్తూ ఎన్నికలకు వెళ్లి తీరా విజయం సాధించిన తర్వాత అతడిని పదవి నుంచి తప్పిస్తే అది కూటమికి నేతృత్వం వహించిన బీజేపీ ఇమేజ్‌కు భంగం కలుగుతుందని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. అలాగే ఏక్‌నాథ్ షిండే సీఎంగా ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ పొందాయని, అతడిని ఆ పదవిలో కొనసాగిస్తే కచ్చితంగా బీజేపీ కూటమి ప్రతిష్ట మరింత పెరుగుతుందని, అధికారం కోసం బీజేపీ వెంపర్లాడదన్న సందేశం ప్రజల్లోకి వెళ్తుందని కొందరు నేతలు అంటున్నారు. అదే సమయంలో ఈ ఎన్నికల్లో కూటమి విజయానికి షిండే చేసిన కృషిని తక్కువ చేయలేమని, ఆయన 75కు పైగా బహిరంగ సభల్లో ప్రసంగించి ప్రచారం చేశారని, ఉద్ధవ్ ఠాక్రేను కాదని ప్రజలు శివసేన, కూటమి పార్టీలకు పట్టం కట్టారంటే అది షిండే చలవేనని వారు తెలిపారు. 'బీజేపీ 100 సీట్లకు పైగా గెలిచినంత మాత్రాన పొత్తు ధర్మం మరచిపోతుందని నేను అనుకోవడం లేదు. కచ్చితంగా షిండేనే సీఎంగా కొనసాగించాలి. తిరిగి మహా సీఎంగా మేము అతడినే చూడాలని కోరుకుంటున్నాం' అని శివసేన నేత ఒకరు పేర్కొన్నారు. బీహార్‌లో బీజేపీకి ఎక్కువ సీట్లు ఉన్నప్పటికీ సీఎంగా నితీశ్‌నే కొనసాగిస్తున్న సంగతిని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'మేము అధికారం కోసం ఎలాంటి బేరసారాలు చేయడం లేదు. కలిసి పోరాడాం, విజయం సాధించాం. గతంలో లాగే కలిసి పాలన సాగిస్తాం' అని ఎన్సీపీ నేత ఒకరు తెలిపారు.

మూడు పార్టీల నిర్ణయమే శిరోధార్యం

సీఎం పదవిపై కూటమిలోని మూడు పార్టీల నిర్ణయం మేరకు సీఎం అభ్యర్థి ఎవరన్నది నిర్ణయిస్తారని ఫడ్నవీస్ సైతం స్పష్టం చేశారు. 'మహారాష్ట్ర ప్రజలు మహాయుతి కూటమిని నమ్మి అధికారం కట్టబెట్టారు. వారి తీర్పు మాకెంతో సంతోషాన్ని కలిగిస్తున్నది. కలిసి పోటీ చేసి విజయం సాధించిన మేము ఇప్పుడు సీఎం పదవి కోసం ఎలాంటి వివాదాలకు తావివ్వం. దీనిపై కూడా అందరూ కలిసికట్టుగానే నిర్ణయం తీసుకుంటాం. ఏ నిర్ణయం తీసుకున్నా మిగిలిన అందరం దానిని శిరోధార్యంగా భావిస్తాం' అని ఆయన పేర్కొన్నారు. తాము 100కు పైగా సీట్లను సాధించామని చెప్పి కూటమిలోని పార్టీలను వదులుకునే ప్రసక్తే లేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే స్పష్టం చేశారు.

స్థిరమైన ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం

మహారాష్ట్రలో స్థిరమైన ప్రభుత్వం ఉండాలని తాము కోరుకుంటున్నట్టు ఎన్సీపీ నేత అజిత్ పవార్ చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటు గురించి నవంబర్ 26కన్నా ముందే నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా, మహారాష్ట్ర సీఎం పదవికి అజిత్ పవార్ పేరు కూడా ప్రస్తావనకు వస్తున్నప్పటికీ ఆయనకు ఎంతమాత్రం అవకాశాలు లేవని, ఆయనను డిప్యూటీ సీఎంగా కొనసాగిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ మిత్రపక్షాలైన ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 41 సీట్లు గెల్చుకున్నాయి.

నేడు సీఎం ప్రమాణ స్వీకారం

మహారాష్ట్ర ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించిన బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధమైంది. మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం సోమవారం ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయని శివసేనకు చెందిన మంత్రి దీపక్ కేసర్కర్ తెలిపారు. తొలి విడతలో ముఖ్యమంత్రితో పాటు 21 మంది మంత్రులతో ప్రభుత్వం కొలువుదీరనున్నదని విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యమంత్రితో పాటు వీరు ప్రమాణం స్వీకారం చేయనున్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి మినహా మరో 43 మందికి మంత్రివర్గంలో చోటు కల్పించవచ్చు. ఇందులో బీజేపీ నుంచి 21, శివసేన (షిండే) పార్టీ నుంచి 12, ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీ నుంచి 10 మందికి మంత్రులుగా అవకాశం లభించవచ్చని తెలుస్తున్నది.

బీహార్ ఉప ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ పార్టీ వైఫల్యం

ప్రభావం చూపని 'జన్ సురాజ్'

పట్నా, నవంబర్ 24: బీహార్‌లోని నాలుగు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ఎన్నికలపై ఏ మాత్రమూ ప్రభావం చూపలేకపోయింది. రెండేండ్లుగా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు, బీహార్‌వ్యాప్తంగా పాదయాత్ర, పెద్ద ఎత్తున మానవ వనరులు అందుబాటులో ఉన్నా.. ప్రశాంత్ కిషోర్ పార్టీ నాలుగు స్థానాల్లో ఓడిపోయింది. తరాని, రామ్‌గఢ్, బెలగంజ్, ఇమామ్ గంజ్ అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో, ఏ ఒక్క చోటా జన్ సురాజ్ అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వలేకపోయారు. మూడు నియోజకవర్గాల్లో మూడో స్థానం, మరో చోట నాలుగో స్థానానికి 'జన్ సురాజ్' పరిమితమైంది.

ఫేక్ ఓటింగ్‌ను నిరోధించే వరకు బైపోల్స్‌లో పోటీ చెయ్యం

బీఎస్పీ అధినేత్రి మాయావతి

లక్నో, నవంబర్ 24: యూపీ ఉప ఎన్నికల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆరోపించారు. ఎన్నికల సంఘం నకిలీ ఓటింగ్‌ను నిరోధించేందుకు చర్యలు తీసుకొనే వరకు భవిష్యత్తులో ఏ ఉప ఎన్నికల్లో, ముఖ్యంగా యూపీలో తమ పార్టీ పోటీ చేయదని ఆమె ప్రకటించారు. యూపీలో జరిగిన 9 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో బీఎస్పీ ఓడిపోయింది. 'గతంలో బ్యాలెట్ పద్ధతి అమల్లో ఉన్నప్పుడు వ్యవస్థను దుర్వినియోగం చేసి, తరచూ మోసం చేసి నకిలీ ఓట్లు వేసేవారు. ఇప్పుడు ఈవీఎంలను ఉపయోగించి అదే పద్ధతిలో నకిలీ ఓట్లు వేస్తున్నారు. ' అని మాయావతి ఆరోపించారు.

సామాజిక మాధ్యమాల ద్వారా కోర్టులపై ఒత్తిడి

- కొందరు చేసే ప్రయత్నాలను జడ్జిలు గమనించాలి
- విశ్రాంత సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల ద్వారా కొన్ని వర్గాలు కోర్టు తీర్పులను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. ఈ విషయంలో న్యాయమూర్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్‌డీటీవీ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ ప్రభావం న్యాయమూర్తులపైన ఉంటుందా? అని ప్రశ్నించినపుడు ఆయన స్పందిస్తూ, 'నేడు ప్రత్యేక ఆసక్తిగల వర్గాలు, ఒత్తిడి తెచ్చే గ్రూపులు ఉన్నాయి. వీరు న్యాయస్థానాలను, కేసుల ఫలితాలను ప్రభావితం చేయడానికి సామాజిక మాధ్యమాలను వాడుకోవాలని ప్రయత్నిస్తుంటారు. ఓ తీర్పునకు ప్రాతిపదిక ఏమిటో తెలుసుకునే హక్కు, కోర్టు తీర్పులపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. అయితే, ఇది కోర్టు తీర్పులకు అతీతంగా, న్యాయమూర్తులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకున్నప్పుడు, ఇది నిజంగా వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛయేనా? అనే ప్రాథమిక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి' అని చంద్రచూడ్ చెప్పారు. నేటి ప్రజలు యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో 20 సెకండ్ల వీడియోను చూసి, దాని ఆధారంగా అభిప్రాయం ఏర్పరచుకోవాలని అనుకుంటున్నారని, ఇది చాలా ప్రమాదకరమని తెలిపారు. న్యాయమూర్తులు పదవీ విరమణ చేసిన తర్వాత రాజకీయాల్లో ప్రవేశించరాదని రాజ్యాంగం కానీ, చట్టాలు కానీ చెప్పడం లేదన్నారు. సమాజం న్యాయమూర్తిని పదవీ విరమణ తర్వాత కూడా జడ్జిగానే చూస్తుందని, అందువల్ల ఇతరులు చేయడం సరైనదే అని భావించే పనులను న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత అయినా చేయడం సరైనది కాదన్నారు. సమాఖ్య వ్యవస్థలో కొలీజియం చాలా మంచి విధానమని చెప్పారు.

28న హేమంత్ సోరేన్ ప్రమాణం

రాంచీ, నవంబర్ 24: జార్ఖండ్ రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా ప్రస్తుత సీఎం, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధినేత హేమంత్ సోరేన్ మరోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి తరఫున గెలిచిన ఎమ్మెల్యేలంతా ఆదివారం హేమంత్ సోరేన్ నివాసంలో సమావేశమై ఆయనను తమ శాసన సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం హేమంత్ సోరేన్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్‌ను కలిశారు. ఇండియా కూటమి ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు సమర్పించి, తదుపరి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ హేమంత్ సోరేన్‌ను గవర్నర్ ఆహ్వానించారు. అంతకుముందు సీఎం పదవికి రాజీనామా చేసిన హేమంత్ సోరేన్.. ఈ నెల 28న నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అప్పటి వరకు ఆయన ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగనున్నారు.

'దివ్యాంగుల పోస్టుల గుర్తింపునకు కమిటీలు'

న్యూఢిల్లీ: కనీసం 40 శాతం వైకల్యం ఉన్న వ్యక్తులకు రిజర్వేషన్లు, పోస్టుల గుర్తింపును క్రమబద్ధీకరించడానికి కేంద్రం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసింది. అటువంటి పోస్టులను కాలానుగుణంగా గుర్తించడానికి, అంచనా వేయడానికి కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఒక వేళ ఏదైనా పోస్టు వారికి సరిపోతుందని భావిస్తే, అన్ని తదుపరి ప్రమోషనల్ పోస్టులు కూడా దివ్యాంగులకు రిజర్వ్ చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ఈ మార్గదర్శకాలు రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ చట్టం, 2016కు అనుగుణంగా ఉన్నాయని పేర్కొంది. ఇటీవల ఢిల్లీ హైకోర్టు దివ్యాంగుల హక్కుల చట్టం 2016 అమలులో అసమానతలు, పోస్టులను గుర్తించడంలో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ లాంటి సంస్థలు వైఫల్యం చెందడంపై విమర్శలు చేసింది. ఈ సందర్భంగా వైకల్య నిర్ధారణకు ఏకరీతి మార్గదర్శకాలు ఏర్పాటు చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ (డీఈపీడబ్ల్యూడీ)ని ఆదేశించింది.

భారత్‌లో ఒక్కరోజే 6.4 కోట్ల ఓట్ల లెక్కింపు

ఎలాన్ మస్క్ ప్రశంసలు..

అమెరికాలో లెక్కింపు ఆలస్యంపై విమర్శలు

న్యూఢిల్లీ: ఇండియాలో ఓట్ల లెక్కింపుపై ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ప్రశంసలు కురిపించారు. ఇటీవల మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో పోలైన 6.4 కోట్ల ఓట్లను ఒక్క రోజులోనే లెక్కించి ఫలితాలు వెల్లడించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎన్నికలు ముగిసిన 18 రోజుల తర్వాత కూడా పోలైన 1.5 కోట్ల ఓట్లను కాలిఫోర్నియా ఇంకా లెక్కిస్తూనే ఉన్నదని విమర్శించారు. 'ఇండియా ఒక్క రోజులోనే 6.4 కోట్ల ఓట్లను లెక్కించింది. కాలిఫోర్నియా ఇంకా ఓట్లను లెక్కిస్తూనే ఉంది' అని మస్క్ పేర్కొన్నారు.

రష్యా సైన్యంలోకి నిరుపేద యెమెన్ యువత

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం రష్యా కిరాయి సైన్యాన్ని నియమించుకుంటున్నది. ఓ ప్రముఖ మీడియా సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం, యెమెన్ నుంచి వందలాది మంది యువతను అక్రమ మార్గాల్లో రప్పిస్తున్నది. దీనికోసం హౌతీకి అనుబంధంగా ఉన్న ఓ కంపెనీ సేవలను వినియోగించుకుంటున్నది. భారత్, నేపాల్ యువతను ప్రలోభపెట్టినట్లుగానే వీరిని కూడా అనేక ఆశలు చూపించి తీసుకొస్తున్నది. రష్యన్ పౌరసత్వంతోపాటు అత్యధిక జీతాలు ఇస్తామని చెప్తున్నది. ఈ నేపథ్యంలో ఇరాన్, దాని మద్దతుగల ఉగ్రవాద సంస్థలతో రష్యాకు సాన్నిహిత్యం పెరుగుతున్నట్లు స్పష్టమవుతున్నది.

ఎన్‌ఐహెచ్ అధిపతిగా జై భట్టాచార్య!

అమెరికాలో కీలక పదవి రేసులో భారతీయుడు

వాషింగ్టన్ డీసీ: స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జై భట్టాచార్య అమెరికాలోని జాతీయ ఆరోగ్య సంస్థ(ఎన్‌ఐహెచ్)కు తదుపరి డైరెక్టర్‌గా నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారు 50 బిలియన్ డాలర్ల బడ్జెట్ కలిగి ఉండే ఈ సంస్థ అమెరికా జీవ వైద్య పరిశోధనలను పర్యవేక్షిస్తుంది. ట్రంప్ మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ జూనియర్‌ను ఇటీవల జై భట్టాచార్య కలిశారు. కోల్‌కతాలో జన్మించిన భట్టాచార్య స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో ఎండీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు.

పేద దేశాలకు 300 బిలియన్ డాలర్ల పర్యావరణ ప్యాకేజీ

కాప్ సదస్సులో నిర్ణయం

తిరస్కరించిన భారత్

బాకు, నవంబర్ 24: అజర్‌బైజాన్‌లో బాకు వేదికగా ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న వాతావరణ సదస్సులో కీలక ఒప్పందం కుదిరింది. ఆదివారం వాడివేడిగా సాగిన చర్చల నడుమ 200 దేశాలు వాతావరణ ఒప్పందాన్ని ఆమోదించాయి. భూతాపాన్ని అరికట్టేందుకు సంపన్న దేశాలు..పేద దేశాలకు చెల్లించాల్సిన మొత్తాన్ని తాజా ఒప్పందం 300 బిలియన్ డాలర్లకు(సుమారుగా రూ.25లక్షల కోట్లు) పెంచింది. వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వచ్చే ఒప్పందానికి సంబంధించి ధనిక దేశాల ఆర్థిక సాయం 500 బిలియన్ డాలర్లకు పెంచాలన్న భారత్ సహా వివిధ దేశాల డిమాండ్ నెరవేరలేదు. ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను, తీవ్రతను పర్యావరణ ప్యాకేజ్ పరిష్కరించదని భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది.

ముగ్గురిని బలిగొన్న జీపీఎస్!

యూపీలో నదిలో పడిన కారు

బరేలీ(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌గంగ నదిలో ఆదివారం కారు పడిపోవడంతో ముగ్గురు మృతి చెందారని పోలీసులు తెలిపారు. సురక్షితం కాని మార్గంలో వెళ్లేలా డ్రైవర్‌ను జీపీఎస్ తప్పు దారి పట్టించడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. బరేలీ జిల్లాలో పట్టపగలు 10 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. 'ఈ ఏడాది మొదట్లో వరదల వల్ల వంతెన ముందు భాగం నదిలో కూలిపోయింది. కానీ ఈ మార్పును జీపీఎస్ మార్గ వ్యవస్థలో సవరించలేదు' అని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశుతోశ్ శివమ్ తెలిపారు. జీపీఎస్ నావిగేషన్‌ను ఉపయోగిస్తున్న డ్రైవర్‌కు వంతెన సురక్షితం కాదన్న విషయం తెలియక కారును వంతెన దెబ్బతిన్న భాగం నుంచి పోనిచ్చాడని పోలీసులు తెలిపారు. వంతెన ముందు ఎలాంటి బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడం ఈ ప్రమాదానికి దారి తీసిందన్నారు. కారును, ముగ్గురి మృతదేహాలను నది నుంచి వెలికి తీశారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నది.

ఘటనా స్థలిలో అల్లర్లను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్న పోలీసులు

యూపీలోని సంభల్‌లో హై టెన్షన్

- మసీదు సర్వే సందర్భంగా జరిగిన అల్లర్లలో ముగ్గురు దుర్మరణం
- 30 మంది పోలీసులకు గాయాలు

సంభల్, నవంబర్ 24: మసీదు సర్వే సందర్భంగా యూపీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. న్యాయస్థానం ఆదేశాలతో సంభల్‌లో ఒక చారిత్రక మసీదులో సర్వే చేస్తుండగా, చోటుచేసుకున్న అల్లర్లలో ముగ్గురు యువకులు మరణించగా, 30 మంది పోలీసులు గాయపడ్డారు. ఆందోళనకారులు కాల్పులు జరపడమేకాక, పలు వాహనాలకు నిప్పు పెట్టి పోలీసులపై రాళ్లు రువ్వారు. రాళ్ల దాడిలో సీఐ సహా 15 నుంచి 20 మంది పోలీసులకు గాయాలయ్యాయి. వీరిలో ఒక కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయం కాగా, డిప్యూటీ కలెక్టర్ కాలు విరిగింది.

పోలీసులపై కాల్పులు

న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు మొఘలుల కాలం నాటి షాహి జామా మసీదును సర్వే చేయడానికి ఆదివారం ఉదయం ఏడు గంటలకు అధికార బృందం రాగా, వారిని ఒక వర్గం అడ్డుకుంది. ఆందోళనకారులు పెద్దయెత్తున మసీదు వద్ద గుమిగూడి నినాదాలు చేయడం ప్రారంభించారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు ప్రయత్నించగా, అక్కడ ఉన్న మూక భద్రతా సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారు. అక్కడ ఉన్న వాహనాలకు నిప్పు పెట్టారు. దీంతో అల్లరిమూకను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జితో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అదే సమయంలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు తుపాకులతో కాల్పులు జరిపారు. అల్లర్లకు సంబంధించి ఇద్దరు మహిళలు సహా పదిమందిని అదుపులోకి తీసుకున్నామని మొరాదాబాద్ డివిజనల్ కమిషనర్ ఆంజనేయ కుమార్ సింగ్ తెలిపారు. కాగా, ఈ ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ బీజేపీపై విమర్శలు చేశారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై ప్రజల దృష్టి మళ్లించడానికి బీజేపీ, అధికార యంత్రాంగం ఈ హింసాత్మక ఘటనకు కుట్ర పన్నారని ఆరోపించారు.

కంపెనీలో కునుకు.. ఉద్యోగం నుంచి తొలగింపు

కోర్టుకెక్కి రూ.41.6 లక్షల పరిహారం పొందిన ఉద్యోగి

న్యూఢిల్లీ: ఆఫీసులో అలసటొచ్చి రెప్ప వాల్చిన ఉద్యోగిని కంపెనీ విధుల నుంచి తొలగించింది. ఆ మాత్రానికే తొలగిస్తారా? అంటూ కోర్టుకెక్కిన ఉద్యోగికి అనుకూలంగా తీర్పు వచ్చింది. అతడికి రూ.41.6 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. చైనా జియాంగ్సు ప్రావిన్స్‌లోని టైజింగ్‌లో జరిగిందీ ఘటన. ఝాంగ్ ఓ కెమికల్ ఫ్యాక్టరీలో డిపార్ట్‌మెంట్ మేనేజర్‌గా 20 ఏండ్లుగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది మొదట్లో విధులకు వచ్చిన ఝాంగ్ డెస్క్‌పై గంట పాటు కునుకు తీయడాన్ని సీసీటీవీలో చూసిన కంపెనీ అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. తనను తొలగించడం చట్టవిరుద్ధమని భావించిన ఝాంగ్ కంపెనీపై కోర్టుకెక్కాడు. కేసును విచారించిన టైజింగ్ పీపుల్స్ కోర్టు న్యాయమూర్తి.. అతడు తొలిసారి విధుల్లో నిద్రపోయాడని, ఆ కారణంగా కంపెనీకి తీవ్రమైన నష్టమేమీ వాటిల్లలేదన్నారు. ఉద్యోగం నుంచి అకారణంగా తొలగించినందుకు రూ.41.6 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

అదానీకి బంగ్లాదేశ్ షాక్!

- విద్యుత్తు ఒప్పందాన్ని సమీక్షించనున్నట్టు వెల్లడి
- ఇప్పటికే విద్యుత్తు ఒప్పందాల్ని రద్దు చేసిన కెన్యా
- అదానీ అమెరికా కేసుపై సుప్రీంకోర్టులో పిటిషన్
- ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్

ఢాకా: గౌతమ్ అదానీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. సౌర విద్యుత్తు కాంట్రాక్టులు పొందేందుకు రూ.2,200 కోట్లు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై అదానీపై అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో అదానీ గ్రూప్‌తో విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్టు ఇప్పటికే కెన్యా ప్రకటించగా, తాజాగా బంగ్లాదేశ్ కూడా ఇదే నిర్ణయం తీసుకుంది. అదానీ కంపెనీతో మునుపటి హసీనా ప్రభుత్వం చేసుకున్న విద్యుత్తు ఒప్పందాన్ని సమీక్షించనున్నట్టు తాజాగా తాత్కాలిక ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. విద్యుదుత్పత్తి ఒప్పందాలను సమీక్షించేందుకు లీగల్, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీని నియమించాలని విద్యుత్తు, ఇంధనం, ఖనిజ వనరుల శాఖపై జాతీయ సమీక్షా కమిటీ సిఫారసు చేసిందని తాత్కాలిక ప్రభుత్వం తెలిపింది. ఈ కమిటీ ప్రస్తుతం ఏడు మేజర్ ఎనర్జీ, పవర్ ప్రాజెక్టులను సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. వీటిలో అదానీ గ్రూప్ యాజమాన్యంలోని బీఐఎఫ్‌పీసీఎల్ 1234.4 మెగావాట్ల కంపెనీ కూడా ఉన్నట్లు వివరించింది.

సుప్రీంకు చేరిన అదానీ 'అమెరికా' కేసు

పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన కేసుపై దర్యాప్తు జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంలో దాఖలైన పిటిషన్లపై జరుగుతున్న విచారణలో భాగంగా ఈ పిటిషన్‌ను అడ్వకేట్ విశాల్ తివారీ దాఖలు చేశారు. అదానీ గ్రూప్ స్టాక్ ధరల మాయాజాలానికి పాల్పడినట్లు హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపించిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ భారత్‌లో సౌర విద్యుత్తు కాంట్రాక్టులను పొందడం కోసం కొందరు నేతలకు రూ.2,200 కోట్ల మేరకు లంచాలు ఇచ్చినట్లు అమెరికా న్యాయ శాఖ తాజాగా ఆరోపించింది. దీనిపై అమెరికన్ కోర్టు సమన్లు కూడా పంపింది. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తోసిపుచ్చింది. అన్ని చట్టాలకు అనుగుణంగానే కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని తెలిపింది. విశాల్ తివారీ తాజాగా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో, అదానీపై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవని చెప్పారు. వీటిపై భారతీయ వ్యవస్థల చేత దర్యాప్తు చేయించాలని కోరారు.

వయో వృద్ధులకు ఆరోగ్య రక్ష

- *70 ఏండ్లు, ఆపై వయస్సు వారికి ఆయుష్మాన్ భారత్-పీఎంజేఏవై కింద 5 లక్షల ఉచిత వైద్య సేవలు*
- *కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది అర్హులున్నా వర్తింపు*



న్యూఢిల్లీ: వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొన్నేండ్ల క్రితం ప్రారంభించారు. 70 ఏండ్లు, అంతకన్నా ఎక్కువ వయసు గలవారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. ఆర్థిక స్థోమతతో సంబంధం లేదు. ఆధార్ కార్డు ఉంటే చాలు. కుటుంబంలోని వయోవృద్ధులు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సను పొందవచ్చు. దేశంలోని 4.5 కోట్ల కుటుంబాల్లో ఉన్న సుమారు 6 కోట్ల మంది వృద్ధులు ఈ పథకానికి అర్హులు. ఒకే కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది అర్హులు ఉంటే, వారంతా కలిసి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స పొందవచ్చు. అంటే, కుటుంబానికి రూ.5 లక్షల వరకు మాత్రమే లబ్ధి పొందడానికి వీలవుతుంది.

ఆయుష్మాన్ వయ్ వందన కార్డ్

70 ఏండ్లు, అంతకన్నా ఎక్కువ వయసు గలవారు, వారి ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా, ఆయుష్మాన్ భారత్ పీఎంజేఏవై సీనియర్ సిటిజన్ పథకంలో చేరవచ్చు. ఈ పథకంలో చేరిన వారికి ప్రత్యేకంగా ఆయుష్మాన్ వయ్ వందన కార్డును అందజేస్తారు.

ఆధార్ తప్పనిసరి

ఆయుష్మాన్ వయ్ వందన కార్డును నమోదు చేయించుకోవడానికి ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. వయసు నిర్ధారణకు ఇది తప్పనిసరి. వృద్ధుల ఆర్థిక స్తోమతతో సంబంధం లేదు.

ఏయే పత్రాలు అవసరం?

ఆయుష్మాన్ భారత్ పీఎంజేఏవై సీనియర్ సిటిజన్ పథకంలో చేరడానికి ఆధార్ సరిపోతుంది. ఇతర డాక్యుమెంట్లు అక్కర్లేదు.

చేరిన వెంటనే చికిత్స పొందవచ్చా?

పీఎంజేఏవై పథకంలో చేరిన మొదటి రోజు నుంచి చికిత్స పొందడానికి అర్హులే. చికిత్స కోసం వెయిటింగ్ పీరియడ్ నిబంధన లేదు. కాబట్టి ఈ బీమా కవరేజ్ తక్షణమే ప్రారంభమవుతుంది.

బదిలీ అవకాశం లేదు

ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం నుంచి వైదొలగి, పీఎంజేఏవైలో చేరినవారు మళ్లీ ఆ ప్రభుత్వ ఆరోగ్య పథకానికి మారడానికి వీలుండదు. పీఎంజేఏవైలోనే కొనసాగాలి.

దరఖాస్తు ఎలా చేసుకోవాలి?

www.beneficiary.nha.gov.in *పోర్టల్ ద్వారా పీఎంజేఏవై పథకానికి దరఖాస్తు చేయవచ్చు. ఆండ్రాయిడ్ యూజర్లు ఆయుష్మాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, దరఖాస్తు చేసుకోవచ్చు.*

ఒకే కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు అర్హులు ఉంటే ఎలా?

ఒకే కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది అర్హులు ఉంటే, మొదటి వ్యక్తి వివరాలను ముందుగా నమోదు చేయాలి. ఆ తర్వాత 'యాడ్ మెంబర్'పై క్లిక్ చేసి మరొకరి వివరాలను నమోదు చేయాలి. ఒక్కొక్కరికి వేర్వేరుగా నమోదు చేయనక్కర్లేదు.

గంటలకొద్దీ నిలబడి పనిచేస్తే బీపీ సమస్యలు!

న్యూఢిల్లీ: గంటలకొద్దీ నిలబడి పనిచేసేవాళ్లలో బీపీ సమస్యలు తలెత్తే అవకాశముందని తాజా అధ్యయనం తేల్చింది. బీపీ సమస్యలు అనేక ఏండ్లుగా కొనసాగటం.. గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తుందని పేర్కొన్నది. నిశ్చలంగా ఒక చోట కూర్చొని పనిచేసేవాళ్లకు ఈ ముప్పు ఉండదని స్పష్టం చేసింది. ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టుర్కు పరిశోధకుల అధ్యయనంలోని అంశాలపై 'మెడిసిన్ అండ్ సైన్స్ ఇన్ స్పోర్ట్స్, ఎక్సర్‌సైజ్' జర్నల్ తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. రోజులో ఎక్కువ సేపు నిలబడి పనిచేసే మున్సిపల్ కార్మికుల బీపీ స్థాయిల్ని పరిశోధకుల బృందం లెక్కించింది. ఒక రోజులో వివిధ సమయాల్లో వారి బీపీ రీడింగ్స్ ఎలా ఉన్నాయో తెలుసుకుంది. గంటలకొద్దీ నిలబడి పనిచేస్తున్నవారిలో బీపీ ఎక్కువగా నమోదుకావటం నిర్ధారణైంది. డెస్క్ జాబ్ చేసేవాళ్లలో గంటలకొద్దీ కూర్చోవటం వల్ల కూడా బీపీ సమస్యలు వస్తాయని పరిశోధకులు చెప్తున్నారు.